# చిన్ని గెలుపు

మంగళ సాయంత్రము ఐదు గంటలకు స్టాఫ్ మీటింగు అయిన తరువాత- ఇంటికి రాగానే అమె కంటికి కనుపించిన దృశ్యం కళ్ళల్లోనుంచి నిప్పులను కక్కించింది. ఒళ్లు తెలియని ఉద్రేకంతో చాపమీద కూర్చుని తన స్నేహితు రాలు మిన్నీతో ఆడుకుంటున్న చిన్నిని జుట్టుపట్టుకుని లేవదీసి, కసిదీరేటట్టు బాదేసింది. ఒంటిమీద అంగుళం మేరయినా విడిచిపెట్టకుండా స్కేలు తీసుకుని చటచట కొట్టింది.

చిన్ని పెదబొబ్బలకు ఆమెకంటే రెండేళ్లు చిన్నవాడయిన అనంత్ భయంతో గోడకంటుకుపోయాడు. తనక్కూడా దెబ్బలు తగుల్తాయేమోనని తలుపు తెరుచుకుని తమ యింటికి పరుగుతీసింది మిన్నీ.

దెబ్బలు తిన్న చిన్ని శోషవచ్చి కింద పడిపోయింది వెక్కుతూ.

దెబ్బలు కొట్టిన మంగళ విసురుగా చెప్పులు విడిచి గదిలో మంచంమీద బోర్లా పడుకుని ఏడ్వటం మొదలుపెట్టింది. కొంతసేపటికి ఏడ్చి ఏడ్చి నిద్ర లోకి జారుకుంది. సుమారు ఎనిమిది గంటలకు ఆమె కళ్లు తెరవగలిగింది.

ఏమిటిది? ఎందుకిలా జరిగింది?

మగపిల్లవాడికీ ఆడపిల్లకూ భేదం లేకుండా సమానంగా పెంచాలని గది నిండా రకరకాల ఆటసామాన్లు ఎంత డబ్బయినా ఖర్చుచేసి కొన్నది. గుఱ్ఱాలను పరుగులెత్తించటమూ- ఎలక్ట్రిక్ రైళ్ళను. మోటారు కార్లనూ కీ ఇచ్చి నడిపించ టము, అవి చెడిపోతే బాగుచేయటము, రోబర్టుని నడిపించటమూ స్వయంగా దగ్గ రుండి నేర్పించటమూ వాళ్ళిద్దరితో బంతులాడటమూ, రింగు ఎగరవెయ్యటమూ చేసింది. బ్లాక్సుతో అక్షరములను అమర్చటమూ, వాటితో మాటలు నేర్పించ టమూ అక్కా తమ్ముళ్లకు పాటలూ ఆటలూ పాడుతూ తనుకూడా వాళ్లతో ఆడుతూ పాడుతూ కాలక్షేపం చేసేది.

ఇదంతా ఎందుకంటే పిల్లల మనసుల్లో ఆటపాటల్లో కూడా స్త్రీ పురుష వ్యత్యాసము మొలకలెత్తకుండా ఆమె చేసిన అనేక ప్రయత్నాలలో ఇవి కొన్ని.

సాధారణంగా ఆడపిల్లలు బొమ్మలతో ఆడి, వాటికి పెళ్ళిళ్ల చేసి, సంసార బాధ్యతలను అప్పటినుంచే ఎవరో శిక్షణ ఇచ్చినట్టుగా వంటలు చెయ్యటం, పదిమందికీ పెట్టటమూ, సంసారాలలో ఉండే కోపతాపాలను ప్రదర్శించటమూ, సంసారాలను తీర్చిదిద్దామనుకోవటమూ వంటి ఆటలు ఆడుతూ ఉంటారు. పిల్లలు తమలో తాము సాంసారికమైన కబుర్లు చెప్పుకుని ఆనందించటము మంగళ కళ్ళారా చూసింది. అన్నిటికంటె ఆమెకు కోపావేశాన్ని కలిగించిన విషయం- "డాడీ వస్తారు. మీకు మంచి స్వీట్సూ బొమ్మలూ తెస్తారు" అని చిన్ని అనటం.

డాడీ ఏమిటి? పురుషశబ్దం వినపడకుండా కనపడకుండా పిల్లలను పెంచుతుంటే ఈ మాటలు చిన్ని ఎక్కడ నేర్చింది? తన పెంపకంలో ఇటువంటి మాటలా? లోపం ఎక్కడుంది?

అందుకే తన పిల్లలను ఇతర పిల్లలతో ఆడనిచ్చేది కాదు. తన పిల్లలిద్దరే వాళ్ళల్లో వాళ్ళు తన శిక్షణ ననుసరించి ఆడుకోవాలి. తనతోటే బైటికి వెళ్ళాలి. జూకీ, మ్యూజియంకీ తనతో కూడా వచ్చి తను వాటినిగురించి చెప్పిన పాఠాలు వినాలి.

ఆమె తన ఆదర్శాలకోసం నిజంగా అజ్ఞాతవాసం చేస్తున్నది. ఆడా, మగా అనే విభేదాలు కనబరిచే భర్తనుండి విడాకులు తీసుకుని దూరంగా ఒక ఊళ్ళో ప్రవేశించింది. బిడ్డలకు ఆదర్శవంతమైన భవిష్యత్తును కల్పించటంకోసం వాళ్లను తను అనుకున్నట్టుగా తీర్చిదిద్దటం కోసం నగరంలో తను చేస్తున్న ఉద్యోగాన్ని వదలుకుంది. రోజుకు వందలు సంపాదించి కుటుంబాన్ని పోషించే భర్తను వదలుకుంది. అతడి ప్రేమానురాగాలను తోసిపుచ్చింది. బిడ్డలకు తండ్రి ప్రేమానురాగాలు అందకుండా దూరంచేసింది. భోగయుతమైన జీవితాన్ని వదలుకుని బిడ్డలతో బైటికి వచ్చింది. నేలమీద కాలుపెట్టి ఎరుగని బిడ్డలను బస్సు ఎక్కించటానికి డబ్బులేక లేత పాదాలు కందిపోయేటట్టు నడిపించింది.

ఇదంతా ఎందుకు? ఈ పాట్లన్నీ ఎందుకు పడ్డది?

స్త్రీలపట్ల మగవాడి ప్రవర్తన నచ్చక-స్త్రీలలోని ఆధిక్యతను ఆమోదించని

పురుషుడు ఆమెను బానిసగా చూస్తున్నాడు. స్త్రీల సమానత్వాన్ని చూడలేని పురుషుడు ఆమెని బానిసగా మారుస్తున్నాడు. నిరంకుశంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ పురుషుడిలోని అహంకారాన్ని ఎదిరించటానికే తనటువంటి నిర్ణయం తీసుకుంది.

ఆమెలోని ఆవేదన, ఆర్థికసమస్య పోటీలుపడి ఆమెను అయోమయావస్థలోకి తీసుకువెళ్ళాయి. మనుగడకోసం చిన్నపిల్లల స్కూల్లో పిల్లలకు ఆటలూ పాటలూ నేర్పటానికి టీచరుగా పనిచేయటానికి పూనుకుంది. ఆ కొద్ది జీతంలో ముగ్గిరి జీవితాలు గడవాలి. తన కడుపు మాడ్చుకుని మాణిక్యాలవంటి పిల్లలకు ఏ లోటు లేకుండా పెంచి పెద్దవాళ్ళను చెయ్యాలన్న సంకల్పంతో ముందుకు సాగింది.

కాని, తాను తిండికీ బట్టకూ ముఖం వాచింది. అయినా ఆమె దృఢ సంకల్పము సడలలేదు. స్త్రీపురుషుల వ్యత్యాసాలను గురించీ, స్త్రీల స్వేచ్ఛను గురించీ, స్త్రీలు సాధించవలసిన హక్కులనూ వాటి విధానాలను గురించీ పెద్ద గ్రంథము రచించింది. కొత్త సిద్ధాన్తాలతో కూడిన ఈ గ్రంథాన్ని ఒక పబ్లిషింగ్ కంపెనీ అచ్చువేసింది. ఈ గ్రంథం పదివేల కాపీలకు పైగా అమ్ముడుపోయింది. దేశదేశాలలోని స్త్రీలూ దీనిని చదివి ప్రభావితులయ్యారు. ఆమె స్త్రీ జనావళి ప్రశంసలందుకొన్నది. ఆ గ్రంథం అనేక ముద్రణలు పొందింది.

మంగళ తన ఆశలనూ ఆశయాలనూ గ్రంథస్థం చేసింది. ఆర్థికంగా బాగుపడ్డది. ఆమె ఆ గ్రంథ రచయిత్రిగా అనేక దేశాలు పర్యటించి ఉపన్యాసాలిచ్చింది.

అటువంటి పరిస్థితులలో ఆ గ్రంథ రచయిత్రి కూతురు బొమ్మలను పెట్టుకుని పెళ్ళిళ్ల చేస్తూ సంసారాలు, భర్తలు డాడీలు అంటూ ఆడుకుంటుందా? కాళ్లు చాపి బొమ్మలను పడుకోబెట్టుకుని స్నానంచేయించి తుడిచి పౌడరు వేస్తుందా? చిన్న మంచంమీద పడుకోబెట్టి బుడ్డితో పాలుపట్టి మంచంమీద పడుకోబెట్టుకోవటం, శాలువ కప్పి పాటలు పాడుతుందా? జోకొట్టుటమూనా ?

ఇవన్నీ ఎవరు నేర్పారు ?

ఇంట్లో డాల్సు లేవు.

తను లేనప్పుడు పక్కింటి అమ్మాయి నడిగి తెచ్చుకుని పిల్లలను పెంచే

విధానాలు తెలుసుకుంటోందా? మూడు బ్లాక్సు తెచ్చి పొయ్యిలా అమర్చి, అగ్గిపుల్లలు పెట్టి వంటచేసి డైనింగ్ టేబుల్ మీద పెట్టి ప్లేట్ లూ, చంచాలు, గ్లాసులూ అమరుస్తుందా?

తను ఎంత జాగ్రత్తపడితేనేమి? చిన్నీ ఇతరులదగ్గర నేర్చుకుంటోంది అన్నీ. తన ఆశయాలకు విరుద్ధంగా తయారవుతోంది.

ఆ పక్కింటి పిల్లతో దీనికి స్నేహం పనికిరాదు. ఆ పిల్లను రానివ్వకూడదు.

తన ఆశయాలకు విరుద్ధంగా తన కూతురే అలా చేయటంతో ఆమె అహం దెబ్బతిన్నది.

వెంటనే లేచి ఆ బొమ్మలన్నీ తీసి పోగుచేసి అగ్గిపుల్ల గీసింది. మరుసటి రోజునుంచి అమ్మాయిని తనతో తీసుకువెళ్ళటం ప్రారంభించింది.

ఆమె కసి కొంత తీరింది.

కాని— ఆ చిన్నారి ముఖం వాడి వత్తి అయింది. తనకు సంతోషాన్నిచ్చే బొమ్మలు మటుమాయమయ్యాయి. ఆ పసిమనసు లోలోపల ఏడ్చింది. బిక్కచచ్చిపోయిన ముఖంతో - జీవంలేని నవ్వుతో - తల్లివెంట తిరుగుతూ ఉండేది కొన్నాళ్లు. ఆ తరువాత స్కూల్లో చేరి చదువుకోవటం మొదలుపెట్టింది. కాని- ఏదో పోగొట్టుకున్నట్టుగా చిన్నబోయిన ముఖంతో తిరిగేది.

ఒక నెలవురోజున మంగళకు ఉపన్యాసమిచ్చే ప్రోగ్రామ్ ఏర్పాటయింది. ఆ మరునాడు చిన్నికి క్లాసుపరీక్ష ఉంది. చదువుకొమ్మని చెప్పి ఆమె ఉపన్యాసమివ్వటానికి వెళ్ళింది.

ఆమె రావటానికి బాగా ఆలస్యమైంది. రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

పిల్లలిద్దరూ ఫ్రిజ్ లో ఉన్న భోజనాన్ని వేడిచేసుకుని తిన్నారు.

తల్లి వెళ్ళిన వెంటనే చిన్ని తన పాత స్నేహితురాలిని పిలిచింది. ఆమె బొమ్మలతో ఆడుకున్నారిద్దరూ. పాటలు పాడుకున్నారు. చిన్ని ముఖం చేటంత అయింది.

చిన్ని ఒడిలో ఒక బొమ్మ, ఆమె మంచంమీద ఒక బొమ్మ, ఆమె భుజంమీద ఒక బొమ్మ, వాటన్నిటికీ పాలసీసాలు, బొమ్మలకు బట్టలు కట్టి, తలదువ్వటం, క్లిప్పులు పెట్టి ముద్దులు పెట్టుకోవటం, ఇద్దరూ కలిసి ఒక పెద్ద బొమ్మను చెరొకచెయ్యి పట్టుకుని నడిపించటం, పాటలుపాడి నిద్రపుచ్చటమైంది.

ఇదంతా అప్పుడే వచ్చిన మంగళ కిటికీ అద్దంగుండా చూసింది.

ఒంటికి కారం రాచినట్లయింది.

ఆమె లోపలికి రాగానే మిన్నూ పారిపోయింది.

ఈసారి మంగళ చిన్నికి పెద్ద శిక్ష వేసింది. తను ఎక్కడికయినా వెళ్ళే టప్పుడు చిన్నిని ఒక్కదాన్ని గదిలో పెట్టి తాళంవేసేది.

మంగళ ఇప్పుడు తను సంపాదించిన డబ్బుతో ఒక మంచి లొకాలిటీలో ఒక ఫ్లాట్ కొనుక్కుంది. అత్యంతాధునికమైన ఫర్నిచరు కొన్నది. ఒక కారు కూడా ఖరీదు చేసింది.

ఇప్పుడామెకు ఏ దిగులూ లేదు. స్వతంత్రంగా జీవనం చేస్తూ గౌరవంగా బ్రతుకుతోంది. డబ్బు పుష్కలంగా చేతికందుతోంది. బ్యాంకుబ్యాలన్సు పెరుగుతూ ఉంది. తన సిద్ధాంతాలను అమలుపరిచే సంఘాలను ఊరూరా నెలకొల్పింది.

పాపం చిన్నికి మిన్నూతో ఆడిన ఆటలు తలుచుకుంటే కళ్ళల్లో మెరుపులు మెరుస్తాయి. బొమ్మలు కళ్ళకు కట్టినట్టుగా ఉంటున్నాయి. మిన్నూనీ ఆమె బొమ్మలనూ తలుచుకొని కళ్లు తుడుచుకుంటుంది. తల్లితో కారులో బజారుకు వెళ్ళినప్పుడు షాపుల్లో కనబడే బొమ్మలను చూసి గాఢంగా నిట్టూరుస్తుంది. ముఖం చిన్నబుచ్చుకుంటుంది. ఏది చూసినా సంతోషం కలగటంలేదు. తన కిష్టమైన ఆహారపదార్థాలు కూడా ముట్టుకో బుద్ధిపుట్టటంలేదు.

ఆ చిన్నారి ముఖం వెలవెలబోతున్నది క్రమంగా.

ఆమె మనసు దేనికోసమో వెంపర్లాడుతున్నది.

చిన్ని స్కూల్లో సరిగా చదవటంలేదని టీచరు హెచ్చరికలు పంపుతున్నది. చిన్నిలో అనారోగ్యంతోపాటు అనాసక్తి అధికమైంది.

చిన్ని వయసుకు తగినట్టుగా పెరగటంలేదని గమనించి మంగళ డాక్టర్ని సంప్రదించింది.

డాక్టరు బాగా పరీక్షచేస్తే జబ్బేమీ కనపడలేదు.

"అమ్మాయి ఆహారం సరిగా తీసుకుంటోందా?"

"వయసుకు తగినట్టు తినటంలేదు"

"ఆహారలోపం బాగా కనబడుతోంది. ఈ పాపను అప్తుల దగ్గర్నుంచి విడదీసి తీసుకువచ్చారా? ఏదో బెంగగా ఉన్నట్టు కనబడుతోంది. చిన్నపిల్ల ఏజబ్బూ లేకపోతే ఉత్సాహంగా సంతోషంగా ఉండాలి కదా."

"నేనే ఆ పాప తల్లిని. పసిపాపగా ఉన్నప్పటినుంచీ ఆయాను పెట్టకుండా నేనే స్వయంగా పెంచుతున్నాను. ఈ పాపకు ఒక తమ్ముడు కూడా ఉన్నాడు తోడుగా ఇద్దరూ కలిసి ఆడుకుంటారు. కాని-ఈ పాప మనసు నాకు అర్థంకావటం లేదు. ఇంట్లో అన్నీ ఉంటాయి కాని-ఒక్కటీ ముట్టుకోదు-తినదు."

"అయితే ఈ పాపను సైకియాట్రిస్టుకు చూపించండి" అన్నాడు.

సైకియాట్రిస్టు ఒక గుజరాతీ స్త్రీ. విదేశాలన్నీ తిరిగి పిల్లలను గురించి డిప్లొమాలు, డిగ్రీలు తెచ్చుకున్నది. పాపను చూడగానే తల్లిని బైట కూర్చోబెట్టి చిన్నిని లోపలికి తీసుకువెళ్ళింది. చిన్నిని దగ్గరగా కూర్చోబెట్టుకుని "నీ పేరేమిటి?" అడిగింది.

ఆ గదినిండా బొమ్మలు. అనేకరకాలు - నవ్వుతున్నవీ, ఆడుతున్నవీ, పరుగెత్తుతున్నవీ వరుసగా అల్మారాలో పెట్టి ఉన్నాయి. కొన్ని గోడలకు తగిలించి ఉన్నాయి. చిన్ని వాటిని చూస్తూ సంతోషంతో చప్పట్లు కొట్టటం మొదలు పెట్టింది.

"నీ పేరు చెప్పు పాపా?"

"చిన్ని"

"చదువుకుంటున్నావా? బాగా మార్కులు వస్తున్నాయా?"

చిన్ని తల వాల్చేసింది.

"నీకు స్నేహితులెవరైనా ఉన్నారా? ఆడుకుంటావా వాళ్ళతో? ఏమాడు కుంటావు?"

చిన్నికి కన్నీళ్లు జలజలా రాలాయి.

"నీ ఈడు పిల్లలు మీ ఇంటిదగ్గర లేరా?"

"ఉన్నారు"

"వాళ్ళతో ఆడుకోవచ్చు కదా?"

"వాళ్లు మా యింటికి రారు" ఆమె ప్రేమతో దగ్గరికి పిలిచి అప్యాయంగా మాట్లాడుతున్నందుకే అటువంటి ఆప్యాయతకు నోచుకోని చిన్నికి దుఃఖం ముంచుకువచ్చింది. పిల్లలూ ఆటలూ అనగానే బిగ్గరగా ఏడ్చింది.

"ఏడవకు, ఎందుకేడుస్తున్నావు? నీవు చదువుకుంటున్నావు కదా. ఏం జరిగిందో చెప్పు, వాళ్లు మంచివాళ్లు కారా?" ఆమెని బుజ్జగిస్తూ కన్నీళ్లు తుడుస్తూ అడిగింది డాక్టరు.

చిన్ని ఆ గదిలోఉన్న బొమ్మలనుచూస్తూ ఇక ఆగలేక తన బొమ్మలను గురించి జరిగింది జరిగినట్టుగా చెప్పింది. వెక్కివెక్కి ఏడ్చింది.

"ఓ అదా సంగతి? నీకు బొమ్మలు కావాలి. స్నేహితులు కావాలి. వాళ్ళతో ఆడుకోవాలి అంతే కదూ?"

అంతేనన్నట్టు తల ఊపింది చిన్ని ఆశతో.

"నీకు కావలసిన వన్నీ ఉంచే బాగా భోజనం చేస్తావా? బాగా చదివి మార్కులు తెచ్చుకుంటావా?"

"ఓ బాగా తిని బాగా చదువుతాను"

డాక్టరు, చిన్ని తల్లిని గురించి కొంతవరకూ ఎక్కడో విన్నది.

ఇంక ఆమెకు ఆ పాప కేసంతా అర్థమైంది.

వెంటనే చిన్ని రెండుచేతుల్లో రెండు బొమ్మలు పెట్టి బిస్కెట్లు చేతికిచ్చింది.

చిన్ని ముఖంలో ఆనందం చిందులు తొక్కింది. డాక్టరు తన ఇంట్లో ఉన్న బొమ్మలన్నీ చూపించింది. చిన్ని సంతోషంతో వాటిని తాకి చూసింది. ఎగురుతూ గంతులు వేసింది. వాటిలో ఒక బొమ్మను చటుక్కున తీసి చంకన పెట్టుకుని ముద్దిచ్చింది.

అది గమనించిన డాక్టరు పాపతో బైటికి వచ్చింది.

మంగళ చాలా సేపయిందని అసహనంతో ఎదురుచూస్తోంది. డాక్టరు చెయ్యి పట్టుకుని బొమ్మలతో వచ్చిన చిన్నిని చూసి, కనుబొమ్మలు చిట్లించి "పాపకేమయింది డాక్టర్?" అడిగింది అప్రసన్నంగా.

డాక్టరు మంగళముఖం వంక పరిశీలనగా చూసి పట్టుదల గల మనిషని గ్రహించింది.

"పాప మానసికంగా దేనికో బాధపడుతోంది. ఆ బాధవల్ల - అంటే ఒక విధమైన బెంగవల్ల ఏదో వెలితిగా ఉన్నట్టు దిగులుగా ఉంటోంది. చిన్నపిల్లలకు వాళ్ళకిష్టమైన స్నేహితులు ఆటలూ పాటలూ కావాలని ఉంటుంది. ఈ కోరిక సహజమైనదీ అందరూ కోరేదీను. వాళ్ళకు ఉల్లాసాన్నీ ఉత్సాహాన్నీ కలిగించే అపాయకరంకాని విషయాల్లో ఆటంకం కలిగితే కొందరి కీపరిస్థితి సంభవిస్తుంది. అవి చెడుపుకు దారితీయనంతవరకూ మనం వాళ్ళను ప్రోత్సహించాలి. ఈ పాపకు మంచి స్నేహితులూ బొమ్మలూ ఆటలూ కావాలి. వాటికి మనం ఆటంకం కలిగించరాదు. ఈ పాప సహజంగా తెలివి కలది. మంచి ప్రోత్సాహం కావాలి. ముఖ్యంగా తల్లిది. ఈ పరిస్థితే ముదిరినట్లయితే పాప రోగగ్రస్తురాలవుతుంది"

అనాసక్తంగా విన్నది మంగళ.

"నేను చెప్పిన సలహాలు పాటించి మళ్లీ పదిరోజులకు తీసుకురండి. ఆమెలో కలిగే మార్పులను గమనించి నాకు పాపతోసహా కనబడండి"

మౌనంగా డాక్టరు ఫీజు చెల్లించి ఇంటికి వచ్చింది మంగళ.

ఆమె కారాత్రి నిద్ర రాలేదు. కలత నిద్రలో కంగారు. వారంరోజులు ఇంట్లోనే గడిపింది.

'ఆడపిల్ల బాల్యంలో మగపిల్లలతో సమానంగా అన్ని ఆటవస్తువులనూ ఆకర్షించదా? ఎందుకని? ఈ వ్యత్యాసం ఎట్లా వచ్చింది? ఎవరు పెట్టారు?'

బాల్యంనుండీ ఆలనా పాలనా - వాళ్ళ పోషణవైపు మొగ్గుచూపుతుందేమీ? ఎవరూ చెప్పకుండానే బొమ్మలను పడుకోబెట్టి జోకొట్టుతుందే? పాలసీసాలతో పాలుపట్టి అతి సున్నితంగా ముద్దుపెట్టుకుంటూ ఆ ఎత్తుకోవటమేమిటి? ఈ పాప కెవరు చెప్పారు?

మగపిల్లవాడు వీటివైపైనా చూడడే? బొమ్మలవైపు చూడవద్దని అతని కెవరు చెప్పారు? ఎవరు నేర్పించారు?'

ఈ దృష్టితో ఆమె ప్రత్యేకమైన శ్రద్ధతో పిల్లలను గమనించటం మొదలు పెట్టింది. ఒక పాప మంచమ్మీద అన్నీ డాల్సే ఉన్నాయి. ఒక పాప బొమ్మ పక్కన లేకపోతే నిద్రపోదట. మరొకపాప తన రెండువైపులా బొమ్మలను పెట్టుకుని, వాటిమీద చెయ్యివేసుకుని పడుకుంటుందట. ఒక్కొక్క తల్లి తమ బిడ్డలను గురించి చెప్పటం మొదలుపెట్టారు మంగళతో.

స్త్రీకి ప్రకృతిసిద్ధమైన సున్నిత స్వభావము బాల్యమునుండే ఉంటుంది. ఎవరూ చెప్పకుండానే ఆలన పాలన వాళ్ళకు పుట్టుకతో వచ్చిన గుణాలు. అందుకే చాలామంది ఆడపిల్లలు బొమ్మలతోనే ఆడుకుంటారు. వాటిని అరికట్టాలనిచూడటం అవివేకం. వాటి నరికట్టజూడటం ప్రకృతి విరుద్ధమని మంగళకు అయిష్టంగా ఉన్నా అంగీకరించవలసి వచ్చింది.

ఆ తరువాత ఆమె మళ్ళీ ఒక గ్రంథం రాసింది. ఆ గ్రంథంలో వెనుకటి అంశాలలో చాలా మార్పు వచ్చింది. ప్రకృతికి అతి సమీపంగా ఉన్నాయా అంశాలు. హక్కులకూ, ప్రేమ అవ్యాజానురాగాలకు సంబంధం లేదనీ, ప్రేమతో కూడా హక్కులు పొందవచ్చునన్న కొత్త అంశాలు చేర్చిందా గ్రంథంలో. ప్రేమతో గెలవలేనిది ఏదీ లేదని నొక్కినొక్కి వక్కాణించింది.

ఆ గ్రంథం కూడా పదివేల కాపీలకు పైగా అమ్ముడుపోయింది. అనేక ముద్రణలు పొందింది. అది కూడా స్త్రీలను ఆకర్షించింది.

పాపకు కావలసినదేమిటో ఇప్పుడు తల్లివద్దనే లభిస్తున్నాయి. పాప ఉత్సాహంగా ఉల్లాసంగా సహజమైన వాతావరణంలో పెరుగుతున్నట్టుగా నెలలోపలే మంచి ఫలితాలు కనబడ్డాయి. అమ్మాయి బాగా కోలుకుంది.

పాపను చూసి డాక్టరు "ఈ పాపలో చాలా మార్పు కనపడుతున్నది. అభివృద్ధి సూచకంగా ఉంది. అప్పుడప్పుడు ఈ పాపను తీసుకువచ్చి చూపించండి. పాపను చూడాలనీ నవ్వించి ముద్దుపెట్టుకోవాలనీ నాకూ ఉంటుంది. నాకు పిల్లలతో కాలక్షేపం చెయ్యటమంటే చాలా ఇష్టం. నా ఇంట్లో చూడండి ఎన్నిబొమ్మలున్నాయో? వాటిని చూడకపోతే నాకు నిద్రపట్టదు సంతోషంగా ఉండదు" అంటూ ఆడబొమ్మ ఒకటి మగబొమ్మ ఒకటి పాపకిచ్చి ముద్దుపెట్టుకుంది డాక్టరు.

పాపను దగ్గరికి పిలిచి "ఎప్పుడైనా వచ్చి ఒక ముద్దిచ్చిపో" అంది సైకియాట్రిస్టు ఆమెను గుండెకు హత్తుకుని.

ఇప్పుడు పాప గదిలో చిన్నవీ పెద్దవీ బొమ్మలు గదినిండా ఉన్నాయి. స్నేహితులను పిలిచి బొమ్మలకు పెళ్ళిచేస్తుంది. పార్టీలిస్తుంది. బొమ్మలను ముద్దుపెట్టుకోనిదే రాత్రిళ్లు నిద్రపోదు. రాత్రిళ్ళు ఆమె పక్కన పెద్దపెద్ద బొమ్మలు ఇటొకటి అటొకటి ఉండాల్సిందే. వాటికి నగలూ డ్రెస్సులూ కొంటుంది.

సైకియాట్రిస్టుకు నెలకొకసారి ముద్దిస్తూ క్లాసులో ఫస్టుమార్కులు తెచ్చుకుంటోంది చిన్ని.

ప్రకృతి ఇంత బలీయమైనదా అనుకుంటుంది చిన్ని తల్లి.